విశాలాంధ్ర
కృష్ణా జిల్లా

కూలేందుకు సిద్ధంగా వసతిగృహం!

- 35 ఏళ్లకే శిథిలావస్థకు
- మరమ్మతులకు నోచుకోని వైనం
- పట్టించుకోని అధికారులు
- చిన్నారుల ప్రాణాలకు భద్రత ఏదీ ...?

విశాలాంధ్ర-అవనిగడ్డ : వసతి గృహాల్లో ఉండి విద్యను అభ్యసించే చిన్నారుల ప్రాణాలకు నేడు రక్షణ కరువైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు పెద్ద పీట వేస్తున్నాం అంటూ చెప్పే మాటలు నీటి మీద రాతలుగానే మిగిలాయి. ఆచరణలో మాత్రం మచ్చుకైనా కనిపించడం లేదు అని చెప్పడానికి ఈ వసతి గృహమే నిలువెత్తు సాక్ష్యం. 1988 జనవరి 30వ తేదీన ప్రారంభం అయిన వసతి గృహం ముచ్చటిగా 35 సంవత్సరాలు కూడా గడవకముందే శిధిలావ్యవస్థకు చేరుకోవడంతో ఏ సమయంలో ఏమి జరుగుతందో అని బిక్కు బిక్కుమంటూ విద్యార్థులు జీవనం కొనసాగించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. స్లాబు పూర్తిగా పెచ్చులు ఊడిపోయి పడుతూ ఉండటంతో ఏ క్షణం ఎవరి మీద పడుతుందో కూడా తెలియని పరిస్థితి. టాయిలెట్స్ సైతం కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వం దృష్టికి ఎన్ని సార్లు తీసుకువెళ్ళినప్పటికి నిధులు కేటాయించడం కానీ, భవనాలకు మరమత్తులు చేయడం కానీ జరగలేదు. రానున్న విద్యా సంవత్సరాన్ని దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి చేసి చిన్నారుల ప్రాణాలకు రక్షణ కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

యువత రాజకీయాల్లోకి రావాలి

విశాలాంధ్ర-మచిలీపట్నం: మారుతున్న కాలానికి అనుగుణంగా యువత ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు యర్రంశెట్టి ఈశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక ముస్తాఖాన్‌పేటలోని దేవునితోటలో ఆదివారం భగత్ సింగ్ 93వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. భగత్‌సింగ్ చిత్రపటానికి మానిగల సుబ్బారావు పూలదండ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగత్ సింగ్ ఆసియాలకనుగుణంగా యువత ముందుకు సాగాలని దేశ స్వతంత్రం కోసం అలుపెరగని పోరాటం చేశారని, ఉరి కంభం ఎక్కే ముందు కూడా ఇంక్విలాబ్ జిందాబాద్ అంటూ నినాదాలు చేసిన ఘనత ఆయనకే దక్కుతుందని, భగత్ సింగ్ ని స్ఫూర్తిగా మనందరం ముందుకు సాగాలని ఆయన అన్నారు. సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఓడుగు చైతన్యకుమార్ మాట్లాడుతూ నాటి నుంచి నేటి వరకు భగత్‌సింగ్ దేశం కోసం చేసిన సేవలు గుర్తుంచుకున్నామని, రానున్న రోజుల్లో కూడా ఆయన్ని తలుచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క దేశ పౌరుడుపై ఉన్నదని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు, సంజీవమ్మ, సంజీవులు మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్‌లో కొల్లు రవీంద్ర

విశాలాంధ్ర-మచిలీపట్నం : ప్రతి వక్కరు తమ పొరుగు వారి పట్ల ప్రేమతో మెలగాలని ఖురాన్ తెలియజేస్తుందని ఆసా? సిద్ధిఖీ తెలిపారు.ఆదివారం మచిలీపట్నం లోని స్థానిక కోనేరుసెంటర్ వద్ద వున్న మీనార్ మసీద్ వద్ద మీనార్ మసీద్ కమిటీ, జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆస్కా సిద్ధిఖీ మాట్లాడుతూ రంజాన్ నెలలో ఖురాన్ అవతరింపజేసాను నేను మనిషిగా పుట్టాను మనిషిగా జీవించాలి లక్ష్యాన్ని నెరవేర్చాలి.సృష్టికర్త వున్నాడు,చరాచర సృష్టిలో సూర్య చద్రులు కూడా గతులు తప్పకుండా వక పవర్ కంట్రోల్ చేస్తోంది.సృష్టిలో ఉన్న ఖురాన్ కూడా అందరి సొత్తు ఘనమైన రాత్రి కూడా రంజాన్ నెలలో వుంది. జీవిన విధానం వుంది.పుట్టుక నుండి పోయేదాకా ఖురాన్లో వుంది. దైవదత్త గ్రంథం ఖురాన్.మనిషి ఋజుమార్గంలో ప్రయాణించాలి అని ఖురాన్ తెలియజేస్తుం దని ఆయన అన్నారు. కురాన్ ప్రకారం ప్రతి ఒక్కరూ బ్రతకాల నీ ఆయన అన్నారు. మాజీ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ప్రపంచ స్థాయిలో ప్రతి ముస్లిం పవిత్ర మాసం గా రంజాన్ మాసం జరుపుకుంటారని, ప్రతి ఒక్కరు అన్నదమ్ముల వలె కలిసిమెలిసి ఉండాలని కురాన్ సారాంశం అని ఆయన అన్నారు. వైఎస్ఆర్సిపి ఎమ్మెల్యే అభ్యర్థి పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) మాట్లాడుతూ కుల మతాలకు అతీతంగా రంజాన్ మాసం ఆచరిస్తారని ఆయన అన్నారు. సభాధ్యక్షులు ఎం డి ఫిరోజ్,రంజాన్ మాసం అంటేనే పవిత్రమైన మాసం ప్రపంచమంతటా ముస్లింలు చేసుకుంటారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమం లో జమాతే ఇస్లాం జిల్లా అధ్యక్షులు అబ్దుల్ కరీం, మచిలీపట్నం నగర కాంగ్రెస్ అద్యక్షులు అబ్దుల్ మతీన్,వైయస్సార్ నాయకులు ఎం డి అన్వర్ హుస్సేన్,అర్బన్ బ్యాంక్ చైర్మన్ పల్లపోతు సుబ్రహ్మణ్యం, నేమత్,షరీఫ్, ముబీన్,సలీం, వాజిద్, మహమ్మద్ కాజా, మోటమర్రి వెంకట బాబా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి గుణపాఠం చెప్పాలి

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : బ్రాహ్మణులను నమ్మించి మోసం చేసిన వైసీపీకి వచ్చే ఎన్నికలలో గుణపాఠం నేర్పాలని బ్రాహ్మణ కార్పొరేషన్ కు పూర్వ వైభవం తీసుకువచ్చే టిడిపి, జనసేన, బిజెపి, అభ్యర్థుల గెలుపునకు జిల్లాలోని బ్రాహ్మణులు అందరూ కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ బ్రాహ్మణ సాధికార సమితి కృష్ణ జిల్లా కన్వీనర్ పి. వి. ఫణి కుమార్, బిజెపి సీనియర్ నాయకుడు, ధూళిపాళ్ల శ్రీరామచంద్రమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం మచిలీపట్నం సిడింటి అగ్రహారంలో తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా కన్వీనర్, పి. వి. ఫణి కుమార్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో పి. వి. ఫణి కుమార్, బిజెపి సీనియర్ నాయకుడు ధూళిపాల శ్రీరామచంద్రమూర్తి లు ఉమ్మడిగా మీడియాతో మాట్లాడుతూ దేశ చరిత్రలో లేని విధంగా రాష్ట్రంలో బ్రాహ్మణులలో కడు పేదరికాన్ని చంద్రబాబు గుర్తించి మొట్టమొదటిసారిగా బ్రాహ్మణుల సంక్షేమం కోసం చంద్రబాబు తీసుకువచ్చిన బ్రాహ్మణ కార్పొరేషన్ ను వైసీపీ పాలకులు నిర్వీర్యం చేశారు అని మండిపడ్డారు. మచిలీపట్నంలో స్వాతంత్ర్య సమరయోధుడు, ఆంధ్రాబ్యాంక్ వ్యవస్థాపకుడు బ్రాహ్మణ జాతి ముద్దుబిడ్డ అయిన స్వర్గీయ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవన నిర్మాణానికి వైసీపీ పాలకులు అడ్డు తగిలారన్నారు జగన్మోహన్ రెడ్డి తన ఐదేళ్ల పరిపాలనలో బ్రాహ్మణులపై ఎంతో వివక్ష చూపి, బ్రాహ్మణ సంక్షేమాన్ని నాశనం చేశారు అన్నారు.జగన్మోహన్ రెడ్డి, వైసీపీ పాలకులకు వచ్చే ఎన్నికలలో బ్రాహ్మణులం దరూ బుద్ధి చెప్పాల న్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ బ్రాహ్మణ నాయకులు నాయకులు, వేమూరి రామకృష్ణారావు, పాండేశ్వర గణేష్ చడగా, బిజెపి బ్రాహ్మణ నాయకుడు, నాగలింగం అయోధ్య రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

బడుగులకు రక్షణ కరువు : బొడ్డు

విశాలాంధ్ర-పెడన : జగన్ పాలనలో బడుగు బలహీన వర్గాలకు రక్షణ కరువైందని మరోసారి రుజువు అయ్యిందని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు అన్నారు.ఆదివారం ఆత్మహత్య చేసుకున్న బాల సుబ్బారావు కుటుంబ సభ్యులకు నివాళులు అర్పిస్తూ స్థానిక గాంధీ విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ మరియు చేనేత కార్మికుల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.కడప జిల్లా కొత్త మాధవరం చెందిన చేనేత కార్మికులు పాల సుబ్బారావు కుటుంబ సభ్యులతో ఆత్మహత్య కు పాల్పడటం అత్యంత బాధాకరమని, ఇది ముమ్మాటికి వైసిపి ప్రభుత్వ హత్యలేనని వేణుగోపాలరావు అన్నారు.సామాజిక న్యాయం అంటూ సొంత జిల్లాలోనే బలహీన వర్గాలకు మరియు చేనేత వర్గాలకు చెందిన వారిపై దాడులకు పాల్పడుతుంటే, జగన్మోహన్ రెడ్డి ఏమి సమాధానం చెబుతాడని అన్నారు గతంలో చేనేత వర్గానికి చెందిన నందం సుబ్బయ్య అనే బీసీ నాయకుడిని అతి దారుణంగా హత్య చేశారని అన్నారు.రాబోవు కాలంలో జగన్మోహన్ రెడ్డికి బడుగు బలహీన వర్గాలకు చెందిన వారు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు యక్కల శ్యామలయ్య,ప్రధాన కార్యదర్శి వహాబ్ ఖాన్, మాజీ కౌన్సిలర్లు పరసా సూర్యనారాయణ ఇమ్మడి నాగపోతరావు బెజవాడ నాగరాజు తెలుగుదేశం పార్టీ నాయకులు అనుముల పూర్ణచంద్రరావు, చందన నారాయణరావు, బళ్ళ ప్రసాదు, హామీదుల్ల,సేనాపతి అజయ్, వెలికట్ల ప్రసాద్ మెట్ల సుబ్రహ్మణ్యం ఖుర్షీద్ బేగం, బొడ్డు దీక్షానందుడు వాసా సాంబశివరావు కోరుమిల్లి వెంకటస్వామి, దాదా తదితరులు పాల్గొన్నారు

మొవ్వవేణుగోపాలుని సన్నిధిలో న్యాయమూర్తులు



విశాలాంధ్ర-కూచిపూడి : మహాకవి క్షేత్రయ్య ఆరాధ్యదైవమైన శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి దేవాలయాన్నిఆదివారం న్యాయమూర్తులు సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కృష్ణాజిల్లా న్యాయమూర్తి ఏ. అరుణ సారిక, మచిలీపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి పద్మ, మొవ్వ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పి రాజన్ ఉదయ్ ప్రకాష్ లు దేవాలయాన్ని సందర్శించి క్షేత్ర మహత్యాన్ని అర్చక స్వాముల ద్వారా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణాధికారి ఎస్ వి సుబ్బారావు పర్యవేక్షణలోదేవాలయ అర్చకులు దీవి సీతారామ హనుమాన్,, దీవి వంశీ మోహన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరిని ఆలయ మర్యాదలతో పూర్ణకుంభంతోస్వాగతించారు. ఈ సందర్భంగా మొవ్వ మండల తాసిల్దార్ సిహెచ్ వెంకటలక్ష్మి, మొవ్వ న్యాయస్థానం పర్యవేక్షకులు పి. శివయ్య, గ్రామస్తులు మండవ బుజ్జి కోటేశ్వరరావు, తాతినేని పూర్ణచంద్రరావు, బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పులి శ్రీనివాస్, కొల్లూరిరామాంజనేయులు, ఉపాధ్యక్షులు కూరేటి శ్రీ వెంకటేశ్వరరావు తదితరులు హాజరైనారు. ఇది ఇలా ఉండగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎస్.వి.ఎన్ .భట్టి (న్యూఢిల్లీ) మొవ్వ వేణుగోపాల స్వామి దేవాలయాన్ని సందర్శించుకోవాల్సిఉండగా ఆఖరి నిమిషంలో కార్యక్రమం రద్దయినట్లు తెలిసింది.

కూచిపూడినాట్యాచార్యునికి సత్కారం

విశాలాంధ్ర-కూచిపూడి : శ్రీ బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వార్షిక కళ్యాణ మహోత్సవాలలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఐదవ రోజైన ఆదివారం కూచిపూడి నాట్యంలో సుదీర్ఘ సేవలందిస్తున్న భాగవతుల రామ్మోహన రావును (రాజమహేంద్రవరం) సత్కరించారు. ఆయనకు నాట్యభూషణ కీర్తిశేషులు చింతా రామ్మూర్తి పురస్కారాన్ని అంద చేశారు. బిస్మిల్లా ఖాన్. యువ పురస్కార్ అవార్డు గ్రహీత, డాక్టర్ చింతా రవి బాల కృష్ణ ద్వారా అవార్డును ఆ కళాకారునికి అందజేశారు.

చెట్ల నరికివేత

విశాలాంధ్ర-అవనిగడ్డ : రహదారుల వెంబడి ఉన్న మహావృక్షాలను సైతం స్వేచ్ఛగా తొలగించేస్తున్నారు. మొక్కలు నాటి పెంచి పోషించండి అంటూ ఉపన్యాసాలు ఇచ్చే ప్రజా ప్రతినిధుల మాటలకు విలువ లేకుండా పలు శాఖల అధికారులు నీరుగాస్తున్నారు. గత వారం అవనిగడ్డ- విజయవాడ కరకట్ట రహదారిలోని వృక్షాలను ఇష్టం వచ్చిన రీతిలో నరికి తొలగించే కార్యక్రమం చేపట్టారు. కరకట్ట రక్షణ కోరుతూ సుమారు 12 సంవత్సరాల క్రితం మొక్కలను నాటగా అవి నేడు వృక్షాలుగా మారి కరకట్టపై ప్రయాణం చేసే వారికి చల్లగాలిని ఇస్తూ సేదతీరేందుకు అనువుగా ఉన్నాయి. రానున్న మూడు నెలల పాటు మండు వేసవిని తలపిస్తూ నిప్పుల కొలిమిలా సూర్య భగవానుడు భగ భగలాడుతూ ఉండే సమయంలో వృక్షాలను తొలగించడంతో పెద్ద ఎత్తున వృక్ష ప్రేమికులు ఆందోళనకు సిద్ధం కాగా, అధికారుల కనుసన్నల్లోనే నరికిన వృక్షాలను తరలించడం జరిగింది. ఇదే కోవలో అవనిగడ్డ-నాగాయలంక కరకట్ట వెంబడి ఉన్న చెట్లను గత నాలుగు రోజులుగా తొలగించి ఎగుమతులు చేస్తున్నారు. దీనిపై అధికారులకు స్థానిక ప్రజలు తెలియచేసినప్పటికి విషమంత కూడా చర్యలు తీసుకున్న దాఖలాలు మచ్చుకైనా కనిపించడం లేదు. ఇప్పటి వరకూ మట్టి, ఇసుక, బుసుక దోపిడి చేసిన అక్రమదారులు నేడు చెట్లను నరికి ఎగుమతులు చేసేందుకు పూనుకున్నారని పలువురు చర్చించుకుంటున్నారు. పెద్ద స్థాయిలో చెట్ల దోపిడీ జరుగుతున్న అక్రమాన్ని అరికట్టేందుకు అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు మాత్రం చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటో అర్థం కావడం లేదు. ఇప్పటికైనా పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి వృక్షాలు తొలగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని అవనిగడ్డ ప్రజానికం కోరుతున్నారు.

మంటాడలో వసంతోత్సవం

విశాలాంధ్ర-పమిడిముక్కల: మంటాడ శ్రీదేవి భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వసంతోత్సవం చక్రస్నానం కన్నులపండువగా జరిగింది. ఈ సందర్భంగా పలువురు మహిళలు శ్రీస్వామి వారి అభ్యుతోత్సవం కార్యక్రమంలో పాల్గొని చక్రస్నానం నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉభయ దాతలు, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త అగస్త్యరాజు రామ్మోహన రావు ఇ.ఓ.మాధవీలత పాల్గొన్నారు.

అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

విశాలాంధ్ర-కూచిపూడి : బాలా త్రిపుర సుందరి సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి 261వ వార్షిక కళ్యాణ మహోత్సవంలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు లో భాగంగా ఐదవ రోజైన ఆదివారం ప్రదర్శించిన పలు అంశాలురంజింప చేశాయి. ఈ కార్యక్రమాల నిర్వహణలో ఒకరైన కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కళా రత్న డాక్టర్ వేదాంతం రాధేశ్యాం నృత్య దర్శకత్వంలో ప్రదర్శించిన "భామాకలాపం" సాంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమాలకే తలమానికంగా నిలిచింది. ఆయన 70 సంవత్సరాలు వయసులో కూడా 'సత్యభామ'గానర్తించి యువ కళాకారులకు ఆదర్శప్రాయంగా నిలిచారు. ఆయన ఆపాత్రలో సందర్భోచితంగాచూపిన ఆవభావాలురసజ్ఞుల మన్ననలు పొందాయి. సూత్రధారులుగా, మాధవిగా బిస్మిల్లా ఖాన్ యువ పురస్కార్ అవార్డు గ్రహీతలు వేదాంతం సత్యనరసింహశాస్త్రి, కురవి సుబ్రహ్మణ్య ప్రసాద్, శ్రీకృష్ణునిగా వేదాంతం సిద్ధేంద్ర వరప్రసాద్ లు తమ నటన ద్వారా ప్రేక్షకులనుఅలరింప చేశారు. వీరితోపాటు నాట్యకళాకారిణులుదేవి హర్ష కృష్ణ, దేవిగీతాకృష్ణ(నెల్లూరు) లు, ఆయన శిష్య బృందం ఈ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. వెంపటి కూచిపూడి డ్యాన్స్ అకాడమీ (హైదరాబాద్) వ్యవస్థాపకులు వెంపటి లక్ష్మణ కుమార్ విద్యార్థులు ఐశ్వర్య, హేమన్య, వాణ్య, జోషిక, హర్షిత లు అర్ధనారీశ్వరం, కృష్ణ పంచకం, లను ప్రదర్శించారు, ఈ అంశాలకు వెంపటి లక్ష్మణ్ కుమార్.నట్టువాంగం నిర్వహించగా, మృదంగంపై పసుమర్తి హరినాథ శాస్త్రి, వయోలిన్ పై పాణ్యం దక్షిణామూర్తి, వేణువుపై కుమార్, ఆహార్యం పై శేఖర్ సహకరించారు.సిరిముమువ్వల నృత్యాలయం వ్యవస్థాపకులు ఏలేశ్వరపు వెంకటేశ్వర్లు పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం కొరియోగ్రఫీలోరూపొందిన జయము జయము లలిత కళా వాణికి అంశాన్ని ప్రదర్శించారు. నాట్యాచార్య మురారి రామ్మోహనరావు (హైదరాబాద్) శిష్యులు ప్రశంస, శృతిఅనన్య, వంశిక, హర్షిని, హంసికలు రామాయణ శబ్దం, కృష్ణ శబ్దం లను ప్రదర్శించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ సంగీత నృత్య కళాశాల అధ్యాపకులు డాక్టర్ పసుమర్తి శ్రీనివాస్ శర్మ క్షేత్రయ్య పదమైన ఎంత చక్కనివాడే.. ప్రదర్శించారు. స్కూల్ ఆఫ్ కూచిపూడి డాన్స్ నిర్వాహకులు నూతి లక్ష్మీ ప్రసూన, సిద్ధి రమణిల శిష్య బృందం ఆకాంక్ష, ఖ్యాతి, తేజస్విని, సాయిలీల, మనస్వినిలు కంజదళాయతాక్షి కామాక్షి, బాలా త్రిపుర సుందరి, పలుకు తేనెల తల్లి, కులుకుగా నడవరో అంశాలను ప్రదర్శించారు. తిరుమల కళ్యాణి (మంగళగిరి) కమలా మనోహర రాగంలోకామాక్షి దరువును ప్రదర్శించారు.

శ్రవణానందకరంగాసాగిన సంగీత విభావరి

ప్రముఖ కూచిపూడిసంగీత విద్వాంసులు, విశ్రాంత ఇంజనీర్ సోమయాజుల గీతా శర్మ (మచిలీపట్నం) ఆలపించిన భక్తి గీతాలు పలువురి ఆకట్టుకున్నాయి. అలాగే కూచిబట్ల వెంకటరమణ భాగవతార్ భక్త పోతన హరికథా గానం చేశారు. వీరికి స్థానిక కళాకారులు వాద్య సహకారాలు అందించారు. ఈ కార్యక్రమాలను తిరుమల తిరుపతి దేవస్థానం సహకారంతో నిర్వహించగా నిర్వాహకులు కళాకారులకు ప్రసంశా పత్రాలు, జ్ఞాపికలు, అంగవస్త్రాలతో సత్కరించారు.

ముత్యాలమ్మ బోనాల పండుగ

విశాలాంధ్ర-కంచికచర్ల: కంచికచర్ల మండలం కీసర గ్రామంలో శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం బోనాల పండుగ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ పునప్రతిష్ఠ సందర్భంగా గ్రామంలో చిన్న పెద్ద తరతమ భేదాలు లేకుండా ప్రజలు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ప్రభ బండ్లు కట్టి గ్రామంలో ఊరేగింపు నిర్వహించి ప్రజలందరూ బోనాల కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించు కున్నారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ఎరగొర్ల రామకృష్ణ,కార్యదర్శి పరిటాల రాము తదితరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.శ్రీ ముత్యాలమ్మ దేవస్థానం కమిటీ సభ్యులు భక్తులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఉద్యోగుల సంఘం కార్యవర్గం ఏకగ్రీవం

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : ఎన్‌సిసి ఉద్యోగుల రాష్ట్ర అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగిందని, ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి పి.రాజశేఖర్ తెలిపారు. ఆదివారం గాంధీనగర్ లోని ఎన్జీవో హోమ్‌లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర శాఖ అధ్యక్షుడిగా విశాఖపట్నం కు చెందిన ఎం.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా కర్నూలు ఎన్‌సిసి గ్రూపుకు చెందిన నాగేంద్రప్రసాద్, కోశాధికారిగా విజయవాడకు చెందిన జీవీకే దుర్గాప్రసాద్,ఇతర కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎన్జీవో సంఘ జిల్లా అధ్యక్షుడు ఏ విద్యాసాగర్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు అభినందనలు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్సిసి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరవడం ఆనందంగా ఉందని, కొత్తగా ఏర్పడిన కార్యవర్గం ఉద్యోగుల మనోభావాలకు అనుగుణంగా వారి శ్రేయస్సుకే నిలబడాలని, అలాగే ఏపీ ఎన్జీవో సంఘం జేఏసీ ఏ పిలుపునిచ్చిన పాల్గొనాలని పిలుపు నిచ్చారు. ఎన్జీవో సంఘం ఎన్‌సిసి ఉద్యోగులకు ఎల్లప్పుడూ చేదోడు వాదోడుగా ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి తోడ్పాటు అందిస్తుందని హామీ ఇచ్చారు.అనంతరం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో ఎన్నికల అధికారి రాజశేఖర్, మధుసూదన్, విద్యాసాగర్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయించారు.

చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు :క్రైమ్ డీజీపీ

విశాలాంధ్ర-ఇబ్రహీంపట్నం : రేపు జరగనున్న సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఏ విధమైన చట్ట వ్యతిరేక అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూడదని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ క్రైమ్ విభాగ అడిషనల్ డిసిపి ఎం కృష్ణమూర్తి నాయుడు అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఆదివారం రౌడీషీటర్స్ లా అండ్ ఆర్డర్, సస్పెక్ట్ క్రైమ్, సస్పెక్ట్ షీట్ హోల్డర్లు కు స్థానిక స్టేషన్ సిఐ ఎం సత్యనారాయణతో కలిసి నిర్వహించిన కౌన్సిలింగ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇకపై సత్ప్రవర్తలతో మెలగాలని సూచించారు. ఎన్నికల సమయంలో ఎటువంటి కేసులు నమోదైనా అనేక ఇబ్బందులను ఎదుర్కొనవలసి ఉంటుందని ఇకనైనా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

రోడ్డుపై దుమ్ము తొలగింపు

విశాలాంధ్ర-అవనిగడ్డ : పంచాయితీ ఆద్వర్యంలో ప్రధాన రహదారికి ఇరువైపులా పేరుకు పోయిన దుమ్మును తొలగించే కార్యక్రమం చేపట్టారు. పంచాయితీ అధికారుల సమక్షంలో ఆదివారం ఉదయం వంతెన సెంటర్ నుండి ఈస్ట్‌కోస్ట్ వరకు గల ప్రధాన రహదారికి ఇరువైపులా పేరుకుపోయిన దుమ్మును తొలగించేందుకు బ్లేడు ట్రాక్టర్‌ను ఏర్పాటు చేశారు. ఈ ట్రాక్టర్ ద్వారా దుమ్మును తొలగించి పెద్ద పెద్ద గుట్టలను ఏర్పాటు చేసి తొలగించే కార్యక్రమంలో పంచాయితీ సిబ్బంది ఉన్నారు. ఈ దుమ్ము వలన రహదారిపై ప్రయాణించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొంత మంది వ్యాపారస్తులు శాసనసభ్యులు సింహాద్రి రమేష్‌బాబు దృష్టికి తీసుకువెళ్లడంతో దుమ్మును వెంటనే తొలగించాలని పంచాయితీ అధికారులను ఆదేశించడంతో పనులు చకచక నిర్వహిస్తున్నారు. దీంతో రానున్న వేసవిలో వాహనదారులు ప్రయాణం సుఖమయం కానుంది.

బస్టాండ్‌లో బ్లేడ్ బ్యాచ్, యాచకులు వీరంగం

భయభ్రాంతులకు గురైన ఆర్టీసీ ఉద్యోగులు, ప్రయాణికులు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): విజయవాడ బస్టాండ్‌లో బ్లేడ్ బ్యాచ్, యాచకులు వీరంగం సృష్టించారు. ఈ ఘటన ఆదివారం తెల్లవారుజామున విజయవాడ బస్టాండ్‌లో చోటుచేసుకుంది. బస్టాండ్‌లో యాచకులు, బ్లేడ్ బ్యాచ్‌లు రాత్రి సమయంలో నిద్రపోతున్నారని ప్రయాణికుల నుంచి ఫిర్యాదు అందింది. దీంతో బస్టాండ్ ఆవుట్ పోస్ట్ పోలీసులు, ఆర్టీసి సిబ్బంది యాచకులను నిద్రలేపి బయటకు పంపే ప్రయత్నం చేశారు. దీంతో యాచకులు, ఒక్కసారిగా పోలీసులు, సిబ్బందిపై ఎదురుతిరిగారు. ఇద్దరి మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది. దీంతో అక్కడ ఉన్న ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. సమాచారం అందుకున్న కృష్ణలంక పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు కొంత మందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : సోమవారం సా॥ 6:24
సహరి : మంగళవారం ఉ॥ 4:50

విశాలాంధ్ర ఎన్టీఆర్ జిల్లా

కమ్యూనిస్టులతోనే పశ్చిమ అభివృద్ధి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): కమ్యూనిస్టుతోనే విజయవాడ పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధి చెందిందని సీపీఐ నగర కార్యదర్శి జీ.కోటేశ్వరరావు అన్నారు. విజయవాడ కొత్తపేట లెనిన్ భవన్‌లో ఆదివారం 37, 50, 51, 52, 53, 54, 55 డివిజన్ల పార్టీ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ కమ్యూనిస్టులను గెలిపించడంతోనే పశ్చిమ నియోజవకర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రజలు అవకాశం ఇస్తే పశ్చిమలో అభివృద్ధి పదములో నిలబెడతారని అన్నారు. రానున్న ఎన్నికల్లో అవకాశవాద రాజకీయాలకు, డబ్బు రాజకీయాలకు పాల్పడుతున్న పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తున్న సీపీఐ అభ్యర్థిని గెలిపిస్తే నియోజకవర్గం అన్ని రంగాల్లో సస్యశ్యామలం చేస్తామన్నారు. నేటి పరిస్థితుల్లో చట్టసభల్లో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం ఉంటే కార్మికుల, రైతుల, వ్యవసాయ, కార్మికుల మహిళల వృత్తిదారుల విద్యార్థి యువజనులు, సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్యాన్ని లూటీ చేస్తూ సంపదను పూర్తిగా కార్పొరేట్ వ్యక్తులకు దారాత్తం చేస్తోందని ఆరోపించారు. ప్రజల కోసం నిరంతరం పనిచేస్తున్న కమ్యూనిస్టులను వచ్చే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో కార్యదర్శివర్గ సభ్యులు తాడి పైదయ్య, కొట్టు రమణారావు, కార్యవర్గ సభ్యులు సింగరాజు సాంబశివరావు, నాయకులు భళ్ళా నరసింహారాజు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

ఎలక్షన్ సీజర్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర-విజయవాడ: ప్రలోభాలకు అడ్డుకట్ట వేసి.. నిష్పక్షపాత వాతావరణంలో ప్రజాస్వామ్య స్ఫూర్తితో ఎథికల్ ఎలక్షన్స్ నిర్వహించేందుకు ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ (ఈఎస్ఎంఎస్)ను సమర్థవంతంగా అమలుచేయడంపై ఎన్ఫోర్స్‌మెంట్ విభాగాల అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలని జిల్లా కలెక్టర్ డిల్లీరావు సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డిల్లీరావు ఆదివారం క్యాంపు కార్యాలయం నుంచి ఆర్వోలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాల నోడల్ అధికారులు తదితరులతో ఎలక్షన్ సీజర్లపై సమావేశం నిర్వహించారు. తొలుత ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో, జిల్లా మొత్తంమీద జరిగిన సీజర్ల వివరాలను తెలియజేశారు. ఈ నెల 16వ తేదీ నుంచి 24వ తేదీ వరకు దాదాపు రూ. 1.27 కోట్ల నగదు, 2,503 లీటర్ల మద్యం, 4,100 గ్రాముల మత్తు పదార్థాలు, 7,139 గ్రాముల విలువైన లోహాలు తదితరాలను కలుపుకొని మొత్తంమీద దాదాపు రూ. 3.60 కోట్ల విలువైన నగదు, వస్తువులను సీజ్ చేసినట్లు వివరించారు. నగదు, మద్యం, మత్తు పదార్థాలు, విలువైన వస్తువులు తదితరాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులతో జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు అప్రమత్తతతో, క్రియాశీలంగా పనిచేయడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈఎస్ఎంఎస్ యాప్‌లో సీజర్లకు సంబంధించిన సమాచారాన్ని వేగంగా కచ్చితత్వంతో అప్‌లోడ్ చేయాలని సూచించారు. రోజువారీ సీజ్‌ల సమాచారాన్ని సంబంధిత నియోజకవర్గాల ఆర్వోలకు కూడా పంపాలన్నారు. జిల్లాస్థాయి గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటీ కార్యకలాపాలు మార్గదర్శకాలకు అనుగుణంగా జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డా. పి.సంపత్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్, డీఆర్వో వి.శ్రీనివాసరావు, ఆర్డీవోలు బీహెచ్ భవానీ శంకర్, కె.మాధవి, రవీంద్రరావు, ఏడీసీపీ ఎం.కృష్ణమూర్తినాయుడు, ఎల్‌డీఎం కె.ప్రియాంక, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వావాహనాల తనిఖీలో రూ.5లక్షలు స్వాధీనం

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): పోలీసులు చేపట్టిన వాహనాల తనిఖీలో రూ.5లక్షలు నగదు పట్టుబడింది. ఈ ఘటన ఆదివారం విజయవాడ ప్రకాశం బారేజీ పోలీస్ చెక్ పోస్ట్ వద్ద జరిగింది. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో విజయవాడ పోలీసులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. ప్రకాశం బ్యారేజీ వద్ద వాహనాల తనిఖీల్లో ఒకరి వద్ద నుంచి రూ.2లక్షలు, మరోకరి వద్ద నుంచి రూ.3లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నగదు సంబంధించి ఎటువంటి ఆధారాలూ చూపకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

క్షయ అంతమే లక్ష్యం

విశాలాంధ్ర-విజయవాడ (కృష్ణలంక) : రాష్ట్రంలో 2025 నాటికి క్షయ వ్యాధిని అంతమొందించటమే లక్ష్యమని టీబీ రాష్ట్ర నివారణాధికారి డా.టీ రమేష్ అన్నారు. ప్రపంచ క్షయ వ్యాది దినోత్సవం సందర్భంగా స్థానిక పాత ప్రభుత్వాసుపత్రి వద్ద ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖాధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిదులు, నర్సింగ్, ఫార్మా కళాశాల విద్యార్థులు, ఎస్‌టీఈపీ భాగస్వామ్య పక్షాల ప్రతినిదులు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ టీబీ కేసుల్లో దాదాపు 24 శాతం దేశంలో నమోదవుతున్నాయని, మరణాలు కూడా ఎక్కువగా నమోదవుతున్నాయని అన్నారు. కయ కేసులను గుర్తించేందుకు రాష్ట్రంలో 720 ట్రూనాట్, 50 సీబీనాట్ సెంటర్ల ద్వారా ఏటా పది లక్షలకుపైగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ అనే కొత్త కార్యక్రమాన్ని ఈ ఏడాది చేపట్టనున్నట్లు తెలిపారు. మొదటగా 12 జిల్లాల్లో నిర్వహించేందుకు సంబంధించి సర్వే జరుగుతోందన్నారు. టీబీ పేషెంట్లుకు పోషకాహార భద్రత కల్పించేందుకు న్యూట్రీషన్ కిట్లును అందిస్తున్నట్లు తెలిపారు. చికిత్స ఉన్న క్షయ వ్యాదిని ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వ్యాది నిర్మూళనలో ప్రతి ఒక్కరూ భాగాస్వాములు కావాలని పిలపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి డా.ఉషారాణి, ఇండియన్ మెడికల్ ఆసోసియేషన్ డా.ప్రమోద్ చలసాని, ప్రముఖ ఊపిరిదిత్తుల డాక్టర్ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

క్షయపై అప్రమత్తం

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : క్షయవ్యాధి అత్యంత అంటువ్యాధి ఇది అన్ని వయసుల వారిని ప్రభావితం చేస్తుందని అత్యంత జాగ్రత్తగా ఉండాలని ఎస్‌సిపి (యుఎస్‌ఎ,ఛాతీ వైద్యుడు)పల్మోనాలజిస్ట్ డా. కె యుగంధర్ సూచించారు 'ప్రపంచ క్షయ దినోత్సవం సందర్భంగా అదివారం రైల్వే హాస్పటల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి మఖ్య అతిధిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి అత్యంత అంటువ్యాధి ఇది వయస్సుతో సంబంధం ఉండదని నీటి బిందువుల ద్వారా వ్యాపిస్తుందని వివరించారు.టీబీ యొక్క లక్షణాలు, గుర్తించడం, చికిత్స (నేరుగా గమనించిన చికిత్స షార్ట్ కోర్సు - డాట్స్) నివారణ గురించి కూడా ప్రేక్షకులకు వివరించారు. ఎసిఎమ్ఎస్ డాక్టర్ ఎమ్. జైదీప్ మాట్లాడుతూ టిబి వ్యాప్తిని నిరోధించడానికి రోగులను తొలి రోజుల్లో చికిత్స చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆరోగ్యకరమైన ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం సరైన నిద్ర రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుందన్నారు.అంతే కాకుండా వ్యాధి రాకుండా తగ్గించగలదని అన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఉద్యోగులు, అధికారులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ముస్లింలకు చేయూత

విశాలాంధ్ర-కంచికచర్ల : కంచికచర్ల మండలం పెండ్యాల గ్రామంలో జే యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేద ముస్లింలకు రంజాన్ తోఫా లతోపాటు చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది. పెండ్యాల గ్రామానికి చెందిన పలువురు ముస్లింలు ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం హైదరా బాద్ తదితర పట్టణాల్లో స్థిరపడ్డారు.వారు ఎంత దూర ప్రాంతాల్లో ఉన్నప్పటికి రంజాన్ పండుగకు మాత్రం స్వగ్రామైన పెండ్యాల గ్రామంకు రావడం ఆనవాయితీ. ఉద్యోగాలు వ్యాపారాల నిమిత్తం పట్టణాలలో స్థిరపడిన వారిలో కొందరు జే యం ఫౌండేషన్ గా ఏర్పడి పెండ్యాల గ్రామంలో సేవా కార్య క్రమాలు చేయడం కొంతకాలంగా కొనసాగు తోంది.గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వ హించి మందులు పంపిణీ చేయడం, విపత్కర పరిస్థితులలో ఆదుకోవడం, పండుగ సందర్భాల్లో ప్రజలకు తోఫాలు పంపిణీ చేయడం వంటి కార్యక్రమాలు జే యం ఫౌండేషన్ నిర్వహిస్తోంది.తాజాగా ఆదివారం జే ఎం ఫౌండేషన్,స్థానిక మత పెద్దల ద్వారా 350 మందికి రంజాన్ తోఫా అందించడంతోపాటు150 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. రానున్న కాలంలో తమ ఫౌండేషన్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేయనున్నట్లు జె యం ఫౌండేషన్, జెయం యూత్ నాయకులు తెలిపారు.

పెన్షనర్లు జగన్‌ను గద్దెదించాలి

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : ఉద్యోగులు,పెన్షనర్లు ఉద్యోగ సంఘ నాయకులందరూ మనకున్న ఓటు హక్కుతో ప్రజావ్యతిరేక ప్రభుత్వం అయిన జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో గద్దెదించుదాం అని ఆంధ్రప్రదేశ్ పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బరాయన్ పిలుపు నిచ్చారు. అదివారం గాంధీనగర్‌లోని హోటల్ ఐలాపురంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు.అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ గంజాయి రాష్ట్రంగా పేరు పొందింది. 50,000 విలువైన ముత్తు పదార్థాలు దిగుమతి చేసుకుని యువత భవిష్యత్తును నాశనం చేసేందుకు వైసిపి కుట్ర పన్నిందని అరోపించారు. జగన్ ప్రభుత్వం ఉద్యోగులకు వ్యతిరేకంగా ఉంది. పెన్షనర్లను పూర్తిగా మోసం చేసిందన్నారు.ఇటువంటి ప్రభుత్వం మరలా అధికారంలోకి రాకుండా చేయాలని పిలుఉ నిచ్చారు.తాము బిల్స్ పెడితే ఇన్‌కమ్ టాక్స్ కట్ చేశారు తప్ప బిల్లులు వేయలేదన్నారు.చంద్రబాబును కలిసి వినతి పత్రాన్ని అందించాం.ముఖ్యంగా ప్రతి నెల1వ తేదిన ఉద్యోగుల కన్నా ముందు పెన్షనర్ లకు ఖచ్చితంగా పెన్షన్ ఇవ్వాలని,క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పాత పద్ధతిలో అమలు పరచాలని,బకాయిలు పెన్షనర్‌లకు ముందుగా చెల్లించాలని, పెన్షనర్‌ల కోసం పెన్షనర్ల సంక్షేమ కార్పొరేషన్ నెలకొల్పాలని, పెన్షనర్లకు రూ.20 లక్షల హెల్త్ ఇన్స్‌రేన్స్ చేయాలని, ప్రజాప్రతినిధులకు ఇస్తున్నట్లు పెన్షనర్లకు కూడా మందులకు 50% డిస్కౌంట్‌కు అన్ని మండల కేంద్రాల్లో ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రత్యేక స్టోర్‌లలో ఇచ్చే ఏర్పాటు చేయాలని చంద్రబాబు అందించాం అందుకు సానుకూలంగా స్పందించి ప్రభుత్వం వచ్చిన వెంటనే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.ఎన్డీఏ కూటమికి గెలుపు కోసం కృషి చేస్తాం..మా మద్దతు ఎన్డీఏ కూటమికే పెన్షనర్లు వైసిపికి వ్యతిరేకంగా ఓటు వేయాలని పిలుపునిస్తున్నాం అన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ జనరల్ పెద్దన గౌడ్, మున్నెయ, నాగభూషణం,మూర్తి, రవీంద్ర, వెంకటేశ్వర రావు, ఇతర జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

డబ్బు జబ్బు కాకూడదని చాటిన మనస్సాక్షి నాటిక

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : హనుమంతరాయ గ్రంధాలయం అనుబంధ సంస్థ అయిన ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ నెలవారీ కార్యక్రమాలలో భాగంగా ఆదివారం సాయంత్రం హనుమంతరాయ గ్రంథాలయం కళావేదికపై హర్ష క్రియేషన్స్ (విజయవాడ) వారి సమర్పణలో డాక్టర్ పి బ్రహ్మానందరావు రచించగా కత్తి శ్యాంప్రసాద్ దర్శకత్వం వహించిన నాటిక డబ్బు కోసం జరిగే అక్రమాలు, అన్యాయాలు, అవినీతి, మాయ మాటలతో మోసాలు వంటివి మనుషులను మభ్య పెట్టవచ్చు కానీ మనస్సాక్షిని ఒప్పించలేవనే ఇతివృత్తంతో మనస్సాక్షి నాటిక రసవత్తరంగా ప్రదర్శించబడింది. దర్శకత్వ పర్యవేక్షణ పిళ్ళా నటరాజ్ చేశారు. నటీనటులుగా ఈవెన భాగ్యరాజ్, పిళ్ళా నటరాజ్, ఎల్ ఎస్ ఆర్ కె ప్రసాద్, కత్తి శ్యాంప్రసాద్, సోమిశెట్టి అమృతవర్షిణి, యజ్జల విజయసాగర్, బోడి ఆంజనేయరాజు, అనిల్, మల్లేశ్వర పట్నాయక్ లు అక్రమ ధనార్జన అనర్థానికి దారితీస్తుందని తృప్తినందించదని మనుషుల వ్యక్తిత్వమే సమాజానికి ఆదర్శమని, చట్టాలు , శిక్షల ద్వారా మార్పుని సాధించలేమని వ్యక్తిగత శీలతే సమాజానికి ఆదర్శమవుతుందనే ఇతివృత్తంతో వారి వారి పాత్రాలలో నటించి మెప్పించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో సభాధ్యక్షునిగా హనుమంతరాయ గ్రంథాలయం కమిటీ అధ్యక్షులు డోగిపర్తి శంకరరావు పాల్గొనగా ముఖ్యఅతిథిగా అంబటి మధుమోహనకృష్ణ, జివిఎస్ఆర్ ఎస్ఎస్ఎస్ వరప్రసాద్, హనుమంతరాయ గ్రంథాలయం కమిటీ కార్యదర్శి నీలం దుర్గారావు, నటుడు, రచయిత, దర్శకులు అనంత హృదయరాజు, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి నందివాడ నాని తదితరులు మాట్లాడుతూ ప్రేక్షకులను శ్రోతలను కళా రస సాగరంలో విహరింప చేసేందుకు వేదికపై కళా ప్రదర్శనల వెనుక కళాకారుల నిరంతర సాధన, శ్రమ ఎంతో ఉందని కళను ఉపాసిస్తూ నమ్ముకుని జీవించే కళాకారులను ఆదుకోవాలని, కళల ప్రదర్శనకు వేదికలు కల్పించి ప్రోత్సహించాలన్నారు.

మైనార్టీలను గుండెల్లో పెట్టుకుంటాం

విశాలాంధ్ర-తాడేపల్లి : టీడీపీ ఐదేళ్ల పాలనలో ఏనాడూ మైనార్టీలపై దాడులు జరగలేదని, వారి సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేశామని, మైనార్టీలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామని మైనార్టీల విషయంలో వైసీపీ దుష్ప్ర చారాన్ని తిప్పికొట్టాలని యువనేత నారా లోకేష్ పేర్కొ న్నారు. ఉండవల్లి నివాసంలో యువనేత లోకేష్ సమక్షంలో 115 కుటుంబాలు టీడీపీలో చేరాయి. లోకేష్ మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదటిగా మైనారిటీ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది తెలుగుదేశం ప్రభుత్వమేనన్న విషయాన్ని ముస్లిం సోదరులంతా గుర్తించాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏనాడూ మైనారిటీలపై దాడులు జరలేదన్నారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటు చేసి పేద ముస్లింలను ఆదుకుంటామని చెప్పారు. మంగళగిరి 13వ వార్డు ఇస్లాంపేటకు చెందిన 50 కుటుంబాలు మాజీ కౌన్సిలర్ వైసీపీ నేత షేక్ బీబీ జాన్, సీనియర్ నేత షేక్ మహ బూబ్, షేక్ తాజుద్దీన్, షేక్ అలీ బాషా నేతృత్వంలో టీడీపీలో చేరాయి. ఖాజా గ్రామానికి చెందిన కుక్కమళ్ళ సాంబయ్య ఆధ్వర్యంలో 20 కుటుంబాలు, చినకాకాని గ్రామానికి చెందిన గండికోట శివశంకరరావు ఆధ్వర్యంలో 20 కుటుంబాలు, బళ్ళా విజయ్‌బాబు, కుక్కమళ్ళ మలే ్లశ్వరరావు ఆధ్వర్యంలో 10 కుటుంబాలు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు గుమ్మా హరిబాబు ఆధ్వ ర్యంలో 15 కుటుంబాలు పార్టీలో చేరాయి. లోకేష్ పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిం చారు. నియోజకవర్గ సమన్వయకర్త నందం అబద్దయ్య, ముఖ్య నేతలు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం

విశాలాంధ్ర-విజయవాడ ఎడ్యుకేషన్: ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్. పోతినేని రమేష్ బాబు ఈ వైద్య శిబిరంలో రోగులను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఇటీవలి కాలంలో వచ్చిన ఆధునిక వైద్య సమాచారం ప్రకారం రక్తపోటు అదుపులో ఉంచుకోవాలని ఎల్లవేళలా 120/80 మించకుండా చూసుకోవాలని ఆ సంఖ్య దాటితే రక్తనాళాలు చిట్లిపోయే అవకాశం తో పాటు గుండె పాటు,పక్షవాతం వచ్చే అవకాశాలు వస్తాయని అదే విధంగా కొంత మంది 100౦ వయసును బీ.పీకు ప్రామాణికంగా తీసుకుంటున్నారని ఉదాహరణకు 60 సంవత్సరముల వ్యక్తి తన బీ.పీ 160/80 ను నార్మల్ బీ.పీ గా భావిస్తున్నారని కానీ ఆధునిక సమాచారం మేరకు ఇటువంటివన్నీ అపోహలేనని 120/80 బీపీను నార్మల్ బీపీ గా ప్రామాణికంగా తీసుకోవాలని తెలియచేశారు.ఈ ప్రాంత ప్రజలకు సూపర్ స్పెషాలిటీ వైద్యులచే సామాజిక బాధ్యతగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించామని తెలియచేస్తూ తిరువూరు పట్టణంలో అత్యాధునిక వైద్య పరికరాలైన క్యాత్ ల్యాబ్,గుండె ఆపరేషన్ థియేటర్ మరియు నిష్ణాతులైన కార్డియాలజిస్టులు, కార్డియో థొరాసిక్ సర్జన్లను అందుబాటులో ఉంచామని ఇప్పటి వరకు 50 యాంజియోగ్రాం పరీక్షలను విజయవంతంగా నిర్వహించామని అతి త్వరలో గుండె జబ్బులకు ఆరోగ్య శ్రీ సేవలను అందుబాటులోనికి తీసుకువస్తున్నామని తెలిపారు. అమరావతి హాస్పిటల్స్ చైర్మన్ కోనేరు వెంకట కృష్ణన్, డైరెక్టర్ శావల దేవదత్, డాక్టర్.కోనేరు కావ్య మాట్లాడుతూ ఈ ప్రాంతంలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను అందుబాటులోనికి తీసుకు వచ్చినందుకు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ బాబును అభినందిస్తూ ఈ వైద్య శిబిరాన్ని తిరువూరు మరియు పరిసర ప్రాంత ప్రజలే కాకుండా తెలంగాణ రాష్ట్ర ప్రజలు కూడా 800 మంది వైద్య సేవలు పొందారని ఈ ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన డాక్టర్లు,సిబ్బందిని అభినందించారు.

టీడీపీ కార్యకర్తపై దాడి!

విశాలాంధ్ర-వీరులపాడు: వైసీపీ కార్యకర్తకు చెందిన గేటు రంగు అభ్యంతరకరంగా ఉందని సి విజిల్ యాప్‌లో బాధితుడు ఫిర్యాదు నమోదు చేశాడు. దీంతో రెండు పార్టీల కార్యకర్తల మధ్య పరస్పర ఆరోపణలతో తీవ్ర స్థాయిలో గొడవలకు దారితీసింది. పోలీసుల వివరాల ప్రకారం వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామంలో వైసీపీ కార్యకర్తకు చెందిన స్థలం ఆవరణకు చెందిన గేటు రంగుపై టిడిపి కార్యకర్త సి విజిల్ యాప్ ద్వారా అభ్యంతరం తెలపగా ఆదివారం ఉదయం వైసిపి కి చెందిన పూల రాంబాబు ప్రశ్నించటంతో టిడిపి, వైసిపి కార్యకర్తల మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో నాగుల్ బాషాకి గాయాలవటంతో నందిగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సి విజిల్ యాప్‌లో అభ్యంతరం నమోదు చేయుటకు ఫోటోలు, వీడియోలు చిత్రీకరించగా పూర్ణ, రాంబాబు, గోవిందరావు అనే వ్యక్తుల తనను దూషించి దౌర్జన్యానికి దిగి తనను విచక్షణ రహితంగా కొట్టారని భాషా ఆరోపించాడు. వీరులపాడు మండల యస్సై ని వివరణ కోరగా భాషా పై దాడి చేసిన ముగ్గురిపై 323, 324, 506, 34 ఆర్/డబ్ల్ ఐపిసి సెక్షన్స్ కింద కేసు నమోదు చేసి కేసు విచారిస్తున్న ఎస్ఐ మహా లక్ష్ముడు తెలిపాడు.

నేటి నుంచి చినతిరుణాళ్ల

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : స్థానిక శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి చిన్న తిరుణాళ్ల నేటినుంచి ప్రారంభం మ పుతాయని ఆలయ కార్యనిర్వాహ ణాధికారి. కె. రమేష్ నాయు డు. చైర్మన్ జంగాల. శ్రీనివాసరరావు. తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ సోమవారం 25 తేదీ నుంచి 29 వ తేదీ వరకు చిన్న తిరుణాలు ఉత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. భక్తులకు అ సౌ కర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేశామనితెలిపారు.సోమవారం ఉదయం 6 గంటలకు ఆకం దజ్యోతిస్థాపన తో ఉత్సవాలు ప్రారంభం అవుతాయి.26 న సాయంత్రం 6.26 నిముషాలకు రదోత్సవం.27 న రాత్రి 8-34 నిముషాలకు దివ్య ప్రాభో త్సవం.28. న సాయంత్రం4-12 నిముషాలకు పసుపు కుంకుమ బండ్లు.29 న ఉదయం 5-30 నిముషాలు నుంచి భక్తులు బోనాలు సమర్పణ.కావున ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి వారిని అమ్మ వారిని దర్శించు కోగలరని కోరుకుంటున్నాము..

గతాన్ని మరిచిపోయి కొత్త జీవితానికి ముందడుగు వేయాలి : ఏడీసీపీ కనకరాజు

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): గతంలో నేరాలకు పాల్పడిన వారు ప్రస్తుత సమాజంలో నవజీవాన్ని గడుపుతూ హుందాగా జీవించాల్సిన అసవరం ఉందని ఏడీసీపీ కనకరాజు అన్నారు. ఆదివారం విజయవాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో వెస్ట్ ఏసీపీ మురళికృష్ణరెడ్డితో కలిసి రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేర వృత్తిని వదిలి తమ పిల్లల భవిష్యత్తును ఉన్నత శిఖరాల వైపు నడిపించేలా బాధ్యత వహించాలని ఆయన సూచించారు. అలా కాదని ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రౌడీషీటర్లు నేరాలకు పాల్పడిన, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవన్నారు. అసాంఘిక కార్యకలాపాలు కొనసాగించేవారి పై గట్టి నిఘా ఉంటుందని తెలిపారు. సమాజంలో మంచి పౌరులుగా ఉండే వారికి కుటుంబంతో సంతోషంగా గడిపే అవకాశం ఉంటుందన్నారు. గతాన్ని మరిచిపోయి మంచి మనసుతో ముందడుగు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ దుర్గాశేఖర్‌రెడ్డి, టూటౌన్ సీఐ గణేష్, భవానీపురం సీఐ కృష్ణ, స్పెషల్ బ్రాంచ్ సీఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీ కూటమిని ఓడించాలి

విశాలాంధ్ర-మంగళగిరి : మతోన్మాద బీజేపీ కూటమిని ఓడించాలని, నిరంకుశ వైసీపీని ఓడించాలని, సీపీఎం, ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. ఆదివారం ఆత్మకూరు గ్రామంలో సీపీఎం విస్తృత సమావేశం సీనియర్ నాయకులు ముసలి పకీరయ్య అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వి.కృష్ణయ్య మాట్లాడుతూ కేంద్రం లో బీజేపీ ప్రభుత్వం ఎన్నికల బాండ్ల రూపంలో కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడిందని ఈ విషయాలు ప్రజలకు తెలియకుండా ఉండే దానికోసం ప్రతిపక్ష నాయకులను ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా నిరం కుశత్వంతో అరెస్టు చేస్తుందని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు, రాజధాని నిర్మాణం, కడప స్టీల్ ఫ్యాక్టరీ, దుగ్గరాజుపట్నం పోర్టు, కేంద్ర విద్యాసంస్థలు ఇవేవీ కూడా అమలు చేయకుండా అన్యాయం చేసిం దని, నరేంద్ర మోదీ రాజధాని శంకుస్థాపనకు వచ్చి చెంబుడు నీళ్లు పిడికెడు మట్టి ఇచ్చి ఆంధ్రప్రజల ఆత్మగౌరాన్ని దెబ్బతీశారని తెలిపారు. కార్యక్రమంలో ఈమని అప్పారావు, పిల్లల మర్రి బాలకృష్ణ, డి.వెంకటౌరెడ్డి, ఎం.జ్యోతిబాసు, జేవీ రాఘవులు, ఉద్దంటి దుర్గారావు, పండల ప్రసాదు, చిట్టేల సీతారామాంజనేయులు, వి.సాంబశివరావు, చిట్టేల జనార్ధనరావు, గద్దం అజయ్ కుమార్, బిట్రా రాంబాబు పాల్గొన్నారు.

అంబటి సిల్క్స్‌ను ప్రారంభించిన విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానంద సరస్వతి స్వామి

విశాలాంధ్ర - విజయవాడ (లబ్బీపేట) : టిక్కిల్ రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన అంబటి వస్త్రాలయమును అంబటి సిల్క్స్ అధినేత రామకృష్ణ, పారిశ్రామికవేత్త ముత్తవరపు మురళీకృష్ణ తో కలసి విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సాత్మానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ విజయవాడ మహానగరం లో అంబటి సిల్క్స్ ను ప్రారంభించామనీ చెప్పారు.విశాఖలో తమ ఆశ్రమంకు అతి సమీపంలో నే అంబటి సిల్క్స్ ఉందనీ,నాణ్యమైన పట్టు వస్త్రాలకు మారు పేరు గా నిలవాలన్నారు.అంబటి సిల్క్స్ రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించాలన్నారు. అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని ఆశీర్వదిస్తున్నానని చెప్పారు.మరిన్ని బ్రాంచులు ప్రారంభించాలని మనస్పూర్తిగా కోరుకుంటున్నాను అన్నారు. అనంతరం అంబటి సిల్క్స్ అధినేత రామకృష్ణ మాట్లాడుతూ....అంబటి సిల్క్స్ విశాఖ లో 2019 లో ప్రారంభం అయ్యిందనీ,విజయవంతం గా విజయవాడ మహానగరం లో కూడా ఈరోజు ప్రారంభించామని చెప్పారు. విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామీజీ ఈ కార్యక్రమానికి రావడం.. అంబటి సిల్క్స్ ప్రారంభించడం ఎంతో సంతోషం గా ఉందన్నారు.రెండు వేల రూపాయల నుంచి రెండు లక్షల వరకు విలువచేసే అన్ని రకాల వస్త్రాలు తమ వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు ,కస్టమర్ కి అనుకూలంగా కస్టమైస్ చేసే వెసులుబాటు ఉందన్నారు.ఉప్పాడ,మైసూర్,కోయంబత్తూర్ నుండి అన్నీ రకాల వస్త్రాలు ఇక్కడ లభిస్తాయనీ చెప్పారు. అన్ని రకముల చీరలతో పాటు, రెడీ మేడ్స్ కూడా ఉంటాయన్నారు. యువతుల కోసం గాగ్రాస్, లెహంగా డిజైనర్ శారీలు ప్రత్యేకంగా ఏర్పాటు చేశామన్నారు అనంతరం పారిశ్రామికవేత్త ముత్తవరపు మురళీకృష్ణ మాట్లాడుతూ...విదేశాలలో ఫంక్షన్ జరుపుకునే వారు కూడా ఇక్కడికి వచ్చి షాపింగ్ చేస్తారనీ,మహిళలకు అందుబాటులో అన్ని రకాల వస్త్రాలు ఉన్నాయనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర ప్రముఖులు తిరుమలరావు, బ్రహ్మం, రమేష్ తదితరులు పాల్గొన్నారు

వి ప్రీపెయిడ్ కస్టమర్ల కోసం ఐపిఎల్ ఆఫర్లు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్రముఖ టెలికాం ఆపరేటర్ వి, ఈ ఐపిఎల్ సీజన్‌లో క్రికెట్ వీక్షణ అనుభవాన్ని మెరుగుపరచడానికి ఉత్తేజకరమైన కొత్త ప్రత్యేక తగ్గింపు ఆఫర్‌లు, అదనపు, బోనస్ డేటా ప్యాకేజీలను ప్రకటించింది. వి యొక్క ప్రీపెయిడ్ కస్టమర్‌లు ఇప్పుడు విభిన్న ధరల శ్రేణిలో డిస్కౌంట్‌లు, డేటా ఆఫర్‌లను పొందవచ్చు. మ్యాచ్‌లను లైవ్ స్ట్రీమింగ్ చేసినా, హైలైట్‌లను తెలుసుకోవాలన్నా లేదా తాజా స్కోర్‌లతో అప్‌డేట్ కావాలన్నా, వి ప్రతి ప్రాధాన్యతకు అనుగుణంగా ఎంపికలను కలిగి ఉంది. ప్రతి ఒక్కరి అవసరానికి తగినట్లుగా ప్యాక్ ఉందని నిర్ధారిస్తుంది. వినియోగదారులు డేటా పరిమితుల గురించి చింతించకుండా వారి క్రికెట్ వీక్షణ అనుభవాన్ని పెంచుకోవడానికి వీలు కల్పిస్తుంది.

మహిళాభ్యున్నతే జగన్ లక్ష్యం : ఆసిఫ్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): రాష్ట్రంలో మహిళాభ్యునతే జగన్మోహన్‌రెడ్డి లక్ష్యమని వైసీపీ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్ అన్నారు వైసీపీ మహిళా విభాగ పశ్చిమ నియోజకవర్గ సమావేశం ఆ పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫ్, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మిలు మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా మహిళలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చిన ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. మహిళలకు అనేక పథకాలను అమలు చేసి వారు సాధికారతను సాధించే విధంగా ప్రభుత్వం పాటుపడిందన్నారు. ఆసరా, చేయూత, కాపునేస్తం వంటి అనేక పథకాలు కేవలం మహిళలకే అమలు చేసిన ఘనత తమ పార్టీకే చెందుతోందన్నారు. పదవుల కేటాయింపులోనూ మహిళలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి, సొంతింటి కలను నిజం చేసే దిశగా రాష్ట్రంలో 33 లక్షల మంది మహిళల పేరు మీద ఇళ్ల పట్టాలను జారీ చేసిన గొప్ప ముఖ్యమంత్రి జగన్ అని అన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డిని గెలపించుకోవాల్సిన బాధ్యత మహిళలందరిపై ఉందన్నారు. పార్టీ మహిళా విభాగం నియోజకవర్గంలోని మహిళలందరికీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని వివరించి పార్టీని గెలిపించేందుకు పాటుపడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో వైసీపీ కార్పొరేటర్ చైతన్యరెడ్డి, ఆసిఫ్ కుమార్తె రేష్మ, మహిళా శ్రేణులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణులకు అండగా ఉంటాం - వెలంపల్లి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విశ్వబ్రాహ్మణ సోదరులకు అండగా ఉంటామని సెంట్రల్ నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం ఆంధ్రప్రభ కాలనీలోని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సెంట్రల్ నియోజకవర్గ విశ్వబ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం జరిగింది ఈ సమావేశానికి సెంట్రల్ నియోజకవర్గ వైస్సార్సీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు,రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పవిత్ర మురళి ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా పవిత్ర మురళి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విశ్వబ్రాహ్మణలంతా వైస్సార్సీపీ అభ్యర్థుల గెలుపుకి పని చేస్తామని అన్నారు.సెంట్రల్‌లో అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు గెలుపుకి మనం కృషి చెయాలని పిలుపునిచ్చారు. తెలిపారు. వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ సోదరులకు నిరంతరం అండగా ఉంటాం అన్నారు. తన దృష్టికి వచ్చిన అన్ని సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తామని హామి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ నాయకులు జవ్వాది సుధీర్,వీరవల్లి బ్రాహ్మణాచారి, చల్లపల్లి మోహన్ రావు,పెంట సాయి కిరణ్,చిప్పాడ కామేష్,కొండ్రు రామ్మోహన్, అప్పలాచారి, ప్రభాకర్, బుచ్చారావు, తదితర విశ్వబ్రాహ్మణ నాయకులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నాదెండ్ల బ్రహ్మయ్య చిరస్మరణీయుడు

సీపీఐ (ఎం ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.ప్రసాద్

విశాలాంధ్ర-విజయవాడ(చిట్టినగర్): నాదెండ్ల బ్రహ్మయ్య చిరస్మరణీయుడని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.ప్రసాద్ అన్నారు. న్యూడెమోక్రసీ విప్లవ పార్టీ ముసుగులో చంద్రం ముఠా మార్చి 7 న గుంటూరులో వారి పార్టీ మాజీ జిల్లా కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మయ్యను కిరాతకంగా హత్య చేశారు. ఈ హత్యను నిరసిస్తూ బ్రహ్మయ్య సంస్మరణ సభ ఆదివారం ఐ.ఎఫ్.టి.యు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ .రవిచంద్ర అధ్యక్షతన శిఖామణి సెంటర్ లో గల చంద్ర రాజేశ్వరరావు గ్రంధాలయంలో వివిధ కార్మిక, దళిత, బహుజన, ప్రజా సంఘాల అధ్వర్యంలో జరిగింది. ఈసందర్భంగా సీపీఐ (ఎం ఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.ప్రసాద్ మాట్లాడుతూ బ్రహ్మయ్య నలభై ఏండ్లుగా విప్లవోద్యమంలో ప్రజలకోసం పనిచేస్తున్నారన్నారు. తానే కాకుండా తన భార్యా ,పిల్లలు అరుణోదయ, పీ డీ ఎస్ యూ కార్యకర్తలుగా దశాబ్దాల పాటు ఉద్యమంలో కృషి చేశారని పేర్కొన్నారు .న్యూడెమోక్రసీ పేరుతో అగ్ర నాయకునిగా చలామణీ అవుతున్న చంద్రంను నమ్మి ఆయన పాపపు చదరంగంలో బ్రహ్మయ్య పావుగా మారాడన్నారు. చంద్రంగా పిలువబడే పాతూరి ఆదినారాయణ స్వామి క్రమశిక్షణ కలిగిన విప్లవకారునిగా జీవితం ప్రారంభించారన్నారు. తూర్పు గోదావరి జిల్లా నుండి గుంటూరుకు మకాం మార్చిన తరువాత వర్గ బంధాలను ప్రక్కన పెట్టి వర్ణ బంధాలను, బంధు వర్గాలను గట్టిపర్చుకొన్నాడని తెలిపారు. వారి శ్రేయస్సే లక్ష్యంగా ఆర్థిక అరాచకాలకు, భూ కబ్జాలకు గుంటూరును కేంద్రంగా చేసుకున్నాడన్నారు. ఈ క్రమంలో విప్లవ ముసుగులో గత ముప్పై సంవత్సరాలుగా పార్టీ కమిటీల కళ్ళు కప్పి అనేక ఆర్థిక కుంభకోణాలకు పాల్పడ్డాడని దుయ్యబట్టారు. చంద్రం ఆర్థిక అరాచకాలపై పార్టీ దృష్టికి రాగానే వేసిన విచారణ కమిటీలో ఈ నిజాలన్నీ రుజువులతో బయటపడ్డాయని ప్రసాద్ చెప్పారు. అందుకే చంద్రం 2013లో తన నేరాలను కప్పిపుచ్చుకునేందుకు పార్టీని కూడా చేల్చాడని గుర్తు చేశారు. పార్టీని చీల్చి కనీసం నైతిక విలువలు పాటించకుండా మా పార్టీ పేరు అయిన న్యూడెమోక్రసీ పార్టీ పేరును వాడుకుంటున్నాడన్నారు. ముసుగులో తన నేర ప్రపంచాన్ని నడుపుతూ అడ్డు వచ్చే వారిని అంతం చేస్తున్నాడన్నారు. గతంలోనూ అనేక మందిని చంపినట్లుగా ఇప్పుడు తమ పార్టీ జిల్లా కార్యదర్శిగా పనిచేసిన బ్రహ్మయ్యను చర్చల కోసం పిలిచి కిరాతకంగా హత్య చేశాడని అన్నారు. చంద్రం దురాగతాలను ఎప్పటి కప్పుడు ఎండగట్టడంలో, పార్టీలో సరైన క్రమశిక్షణా చర్యలు తీసుకోలేక పోవడం వంటి విషయాల పై మా పార్టీ కూడా తగిన స్వవిమర్శ, గుణపాఠాలు తీసుకుంటుందని ఇది మా బాధ్యత అన్నారు. బ్రహ్మయ్య హత్యకు కారకుడైన చంద్రం అతని హంతక ముఠాను అరెస్టు చేసి శిక్షించాలని దళిత, ప్రజా సంఘాలు తొలుత ఆందోళన చేసాయన్నారు .ఈ ఉద్యమం రెండు తెలుగు రాష్ట్రాలకు వ్యాపించడం చంద్రం ముఠా కు చెప్పు దెబ్బ లాంటిదని అన్నారు. ఇందుకు దళిత, బహుజన, ప్రజా సంఘాలను ఆయన అభినందించారు. విప్లవోద్యమంలో ఇలాంటి హత్యా రాజకీయాలకు తావు లేదని చంద్రం హంతక ముఠాను అరెస్టు చేసి శిక్షించేంత వరకు ఈ ఉద్యమంలో సిపిఐ ఎమ్.ఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కలసి ఉంటుందని ప్రకటించారు. నాదెండ్ల బ్రహ్మయ్య జీవిత సహచరి నాదెండ్ల సామ్రాజ్యం మాట్లాడుతూ చంద్రంని నమ్మిన తమ కుటుంబాన్ని ఇలా దిక్కు లేని స్థితికి దిగజార్చాడని ఆవేదన వ్యక్తం చేసింది. నా భర్త ఐదారు కోట్ల రూపాయిల ప్రజా ధనాన్ని భూపోరాటాలలో దోచుకున్నారని ఆరోపిస్తున్నారని కానీ ఏడువేల రూపాయిలు కూడా తమవద్ద లేవని సామ్రాజ్యం వాపోయారు. పార్టీ ప్రమాణాల ప్రకారం అద్దె ఇంట్లో జీవిస్తూ, చనిపోయేంత వరకు తన భర్త సైకిల్ పైన తిరిగిన విషయం గుర్తు చేశారు. నిజానికి ఆ ఐదారు కోట్లు దోచుకున్నదీ , దాచుకున్నదీ చంద్రం హంతక ముఠాయేనని తెలిపారు. వారి ఆర్థిక, నైతిక మోసాల రుజువులు తెలిసిన తన భర్త బ్రతికి ఉంటే ఎప్పటికైనా ప్రమాదమని భావించి తన భర్తను చర్చలకు పిలిచి దారుణంగా చంపేశారని కన్నీటి స్వరంతో విలపిస్తూ చెప్పారు. దళిత బహుజన ఫ్రంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యారావు మాట్లాడుతూ ముప్పై సంవత్సరాలకు పైగా బ్రహ్మయ్య పరిచయం అన్నారు విద్యార్థి నాయకులుగా, ప్రజా ఉద్యమకారులుగా రాజకీయాలు వేరైనా కలిసి పనిచేశామని గత స్మృతులు వివరించారు. కమ్యూనిస్ట్ పార్టీలలో కూడా అగ్రవర్ణ భావజాలం పోలేదని అనడానికి బ్రహ్మయ్య హత్యే ఒక నిదర్శనమన్నారు. గత రెండు సంవత్సరాలుగా పార్టీ ప్రక్కన పెట్టినా ,ప్రజా జీవితం నుండి బ్రహ్మయ్య వైదొలగలేదని దళిత, ప్రజా ఉద్యమాలలో ఒక కార్యకర్తగా చురుకైన పాత్ర పోషించారన్నారు . చంద్రం హంతక ముఠా కోపానికి ఇది కూడా ఒక కారణమన్నారు. చంద్రం వంటి హంతక ముఠాలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. దళిత, బహుజన, విప్లవ, ప్రజా సంఘాలు, పార్టీలన్నీ బ్రహ్మయ్య హంతకులకు శిక్షలు పడేంత వరకు ఐక్య ఉద్యమాలు సాగించాలని కోరారు. ఈ సభలో ఇంకా ఓ పీ డీ ఆర్ జాతీయ అధ్యక్షులు సీ భాస్కరరావు,విప్లవ రచయితల సంఘం (విరసం) అధ్యక్షులు అరసవిల్లి కృష్ణ, పీ కే ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.కొండా రెడ్డి, పీ డీ ఎం నాయకులు క్రాంతి, ప్రగతిశీల న్యాయవాద సంఘం నాయకులు శిఖా సురేష్,ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ పరిరక్షణా కమిటీ అధ్యక్షులు కారుమంచి రామారావు,కవి డెన్నిస్ రాయ్, పీ ఓ డబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి పి.పద్మ, ఐ ఎఫ్ టీ యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పోలారి తదితరులు మాట్లాడారు.

నిత్యావసర సరకులు పంపిణీ

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): హెల్పింగ్ టు గెధర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రామవరప్పాడులోని అనాధ శ్రమంలోని పిల్లలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా బీఆర్‌టీయస్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు, డిప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్ హాజరైయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాధ పిల్లలకు, పేదల కోసం మా వంతు సహాయ సహకారాలు పూర్తి స్థాయిలో ఉంటాయని తెలిపారు. స్వచ్ఛంధ సంస్థలు పేదలను ఆదుకోవటంలో ముందుంటుందన్నారు. హెల్పింగ్ టు గెధర్ వాకర్స్ క్లబ్ నిరంతరం చేస్తున్న సేవా కార్యక్రమాలను ఆయన కొనియాడారు.అనంతరం హెల్పింగ్ టుగెదర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు నాగ మల్లిక పేద అనాధ పిల్లలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేసారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి షేక్ షఫీవుల్లా, కోశాధికారి రహీమా, సభ్యులు మక్బూల్ తదితరులు పాల్గొన్నారు.

వెనిగండ్ల పర్యటన

విశాలాంధ్ర-గుడివాడ : వలివర్తిపాడు వైసిపి పార్టీకి చెందిన పలువురు నాయకులు టిడిపి పార్టీలోకి వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుల సమక్షంలో కండువాలు కప్పుకున్నారు. టిడిపి అభ్యర్థి వెనిగండ్ల రాము గెలుపుకు కృషి చేస్తామని వలివర్తిపాడు గ్రామనికి చెందిన 20 కుటుంబాలు గుడివాడలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి నాని తీరుపై విరక్తి చెందిన ప్రజలు, టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో అర్బన్ బ్యాంక్ చైర్మన్ పిన్నమనేని బాబ్జి, రూరల్ మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, మాజీ వైస్ చైర్మన్ గుండిమేడ రాఘవేంద్రరావు, దొండపాటి మహేష్, రేమల్లి రజినికాంత్, డొక్కుమాల అనంత్, తదితరులు పాల్గొన్నారు. పొలకొండ పావనగిరి మహోత్సవాలలో కుటుంబసభ్యులతో రాము పోలుకొండ పావనగిరి మాత మహోత్సవాలు - ఉత్సవ ముగింపు ప్రార్థనల్లో వెనిగండ్ల రాము-సుఖధ దంపతులు పాల్గొని ప్రతకే ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాము సుఖధలు మాట్లాడుతూ భక్తుల పాలిట కల్పతరువైన నిర్మలగిరి మాత దీవెనలతో ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలన్నారు. పొలుకొండ పావనగిరి మాత దీవెనలతో సంతోషంగా ఉండలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, ఉప్పల వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

నేడు గీతామందిరంలో లక్ష్మీ జయంతి

విశాలాంధ్ర-అవనిగడ్డ : లక్ష్మీనారాయణ స్వామి వారి ఆవరణలో గల గీతామందిరంలో లక్ష్మీజయంతి మహోత్సవానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. సోమవారం గీతామందిరంలో పాల్గున శుద్ధ పౌర్ణమి (హోళిక పౌర్ణమి) ఉత్తర పాల్గున నక్షత్రంను పురస్కరించుకుని లక్ష్మీ జయంతి హోమాలు నిర్వహిస్తున్నట్లు మందిర కమిటీ చైర్మన్ యర్రంశెట్టి శ్రీహరిబాబు, భోగాది రాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు రాజ్యలక్ష్మీ అమ్మవారికి పంచామృతాలతో విశేష అభిషేకాలు, 10 గంటలకు సప్తగుండములతో సప్తజిహ్వల ద్వారా శ్రీలక్ష్మీ నరసింహా సుదర్శన మహాయాగం, 12 గంటలకు పూర్ణాహుతి తదుపరి కర్తలకు మహాదాశీర్వచనం, తదియారాధన జరుగుతుందన్నారు. కావున భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని యాగదర్శనంతో పాటు యాగప్రదక్షణలు చేసి శ్రీలక్ష్మీ అమ్మవారి దివ్య కృపకు పాత్రులు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు అర్చక స్వామి దివి నరసింహామూర్తి సెల్ నెంబర్ 9247438804ను సంప్రదించాలన్నారు.

సీఎంకు బుద్ధి చెప్పడం ఖాయం : కాగిత

విశాలాంధ్ర-పెడన : వచ్చే ఎన్నికల్లో బడుగు బలహీన వర్గాలు ప్రజలు సీఎం జగన్ కు బుద్ధి చెప్పడం ఖాయమని టిడిపి జనసేన బిజెపి పెడన నియోజకవర్గ శాసనసభ ఉమ్మడి అభ్యర్థి కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆదివారం పెడన మండలం చేవేంద్ర గ్రామంలో గడపగడపకు తిరుగుతూ శంఖారావం మేనిఫెస్టోను సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ నా ఎన్నికల గుర్తు సైకిల్ అని సైకిల్ గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కాగిత ఓటర్లను అభ్యర్థించారు తొలుత చేవేంద్ర గ్రామంలో కృష్ణ ప్రసాద్ జనసేన నియోజకవర్గ సమన్వయకర్త పంచకర్ల సురేష్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాగిత మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలను బలి తీసుకోవడమే ఈ వైసీపీ ప్రభుత్వం యొక్క నినాదంగా అనిపిస్తుందని అన్నారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలోనే చేనేత కుటుంబం ఆత్మహత్యకు పాల్పడడం జరిగిందని వారి ఆస్తులకు రక్షణ లేదని ఈ విషయం చేనేత కుటుంబం బలవన్ మరణంతో మరోసారి రుజువైందని, రాజంపేట నియోజకవర్గం ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరం గ్రామానికి చెందిన పాల సుబ్బారావు, భార్య పద్మావతి, చిన్న కుమార్తె వినయ ఆత్మహత్యకు పాల్పడటం చాలా బాధాకరమని సీఎం జగన్ సొంత జిల్లాలోని పేదల భూములు లాగేసుకున్నారంటే ఇక రాష్ట్రంలో పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చని అన్నారు. జగన్ అధికారంలో వ్యవస్థలను చేతిలోకి తీసుకొని రికార్డులు తారుమారు చేస్తున్నారు. వైసిపి నేతల వేధింపులకు ఆ కుటుంబం తట్టుకోలేక బలవన్ మరణానికి పాల్పడడం జరిగిందని కడప జిల్లా కొత్త మాధవరం గ్రామంలో జరిగిన ఘటనపై కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాగిత డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు శలపాటి వీరప్రసాద్, జడ్పిటిసి అర్జ వెంకట్ నగేష్, జనసేన మండల పార్టీ అధ్యక్షులు ఊసా. వెంకయ్య, చే వేంద్ర పైడేశ్వరరావు, చీర్ల నవీన్ కృష్ణ, నందిగామ సర్పంచ్ సీతయ్య, ఏడుకొండలు, నాని, గుడిసేవ సాయి, సుబ్బారావు, పోల గాని రాంబాబు, కాగిత వాసు, గంధం రాంబాబు, రాష్ట్ర టిడిపి నాయకులు గుడిసేవ శ్రీరామమూర్తి, బొల్ల నాగేశ్వరరావు, ఉమ్మడి పార్టీ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు

రామలింగేశ్వరుని కళ్యాణ వేడుకలు

విశాలాంధ్ర-కూచిపూడి : కూచిపూడి నాచార్యులఇలవేలపైన శ్రీ బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవవేడుకలు నాట్య క్షేత్రమైన కూచిపూడి అగ్రహారంలో ఆదివారం వేకువజామున పండితుల వేదమంత్రాలు నడుమ మంగళవాయిద్యాలయ హోరులో అశేష భక్తులనడుమఅంగరంగ వైభవంగా జరిగాయి. త్రయాహిక దీక్షతో వైదిక రత్న, శతాధిక ప్రతిష్టాచార్యులు, పూర్ణ దీక్షాపరులు రాళ్లపల్లి ఆంజనేయ శాస్త్రి శిష్యుల ఆధ్వర్యంలో కళ్యాణాన్ని సోమయాజులఉదయ భాస్కరరామ్మోహన శర్మ-ఆదిలక్ష్మి దంపతులు నిర్వహించారు. ఈ వేడుకలకు దేవాలయ పాలకమండలి సభ్యులు కావూరి భానుమూర్తి, భాగవతులు బాలకృష్ణ ప్రసాద్, జోశ్యుల నగజగన్మోహనరావు, డాక్టర్ ఏలేశ్వరపు హనుమంతరావు,భాగవతుల సీతాపతి రావు, పసుమర్తి నారాయణమూర్తిలు పర్యవేక్షించగా ఆలయ అర్చకులు పెనుమూడి పూర్ణచంద్ర శేఖర శర్మ, పెనుమూడి సతీష్ కుమార్ లు సహకరించారు. ఈ సందర్భంగా భారీ స్థాయిలో అనుసమారాధననిర్వహించారు. రాత్రికి రథోత్సవ వేడుకలను నిర్వహించారు.